


# కరపత్రం

SINCE 2014

బుధవారం జూన్ 24, 2026 | సంపుటి : 2 | సంచిక : 252 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## హైదరాబాద్ మెట్రో రైల్

# ఫేజ్–2కు గ్రీన్ సిగ్నల్

### కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ
- మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి



న్యూఢిల్లీ,జూన్23 :
హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్–2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర–రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్–1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్–2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

మిగతాద్ది 2 లో

# రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ,జూన్23
ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

- రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
- 'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
- కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్
- 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి.!



భద్రాద్రి కొత్తగూడెం,జూన్23 :
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి



న్యూఢిల్లీ,జూన్23 :
కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

2లో..

## ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

ఉచిత బీమా పథకం ప్రారభించనున్న సిఎం



హైదరాబాద్,జూన్23 :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత జీవిత బీమా పథకాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది.



## ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

- పేదల ఇళ్లను లాక్కుంటున్న రెవెన్యూ మంత్రి
- ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారు...వారికి ఇళ్లేవి
- ఖమ్మం పర్యటనలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

ఖమ్మం,జూన్23 :

2లో..

### మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

# హౌస్ అరెస్టు

- రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల
- సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్



హైదరాబాద్,జూన్23 :
మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

మిగతాద్ది 2 లో

### పాఠశాలలు, అంగన్‌వాడీలకు

# నిరంతర నీటి సరఫరా

- స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు
- అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష



2లో

హైదరాబాద్,జూన్23 :
పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు.



## రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళా

- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రులు
- విత్తనాలు, ఎరువుల సద్వినియోగం చేసుకోవాలని సూచన
- పలు జిల్లాల నుంచి పాల్గొన్న ఎమ్మెల్యేలు

హైదరాబాద్,జూన్23 :
రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళాల ప్రారంభం అయ్యింది.రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతు నేస్తం'

2లో..



మిగతాది 2లో

## సింగరేణి బొగ్గు చోరీ జరగలే..ఈ అండ్ ఎం డైరెక్టర్ తిరుమలరావు

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

మొదటిపేజీ తరువాయి

రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూలగొడుతోందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టిస్తుందని తెలిపారు. రెవెన్యూ మంత్రి హయాంలో పేదల ఇళ్లు లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో హరీశ్‌రావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడి పేదల గూడు లాక్కుంటే ఊరుకోమని చెప్పామని అన్నారు. ఎవరి స్థలాలు అయితే లాక్కున్నారో.. వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే తానే పోరాడుతానని స్పష్టం చేశారు. తాను దగ్గరుండి ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఖమ్మం జర్నలిస్టులకు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు. ఖమ్మంలో పేదల ఇళ్లు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని చెప్పి హైడ్రా పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయనకు కళ్లు నెత్తికెక్కాయని.. అహంకారాన్ని ప్రదర్శించే వాళ్లే హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకుంటారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి పాలనంత బ్లాక్‌మెయిల్ పాలన అయిపోయిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో కనీసం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని దుస్థితి ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి

జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడు తున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ప్లాప్ అయిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండు సున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు.. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మార్కెట్‌లో యూరియా దొరకడం లేదని, యాసంగి బోనస్ రెండు సార్లు ఇవ్వాల్సి ఉన్నా అడ్రస్ లేదని హరీష్ రావు విమర్శించారు. వడ్ల కొనుగోళ్లలో క్వింటాకు 5 కేజీల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. 'అసెంబ్లీలో వడ్లకు తరుగు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తరుగు తీస్తున్నా పట్టించుకోకుండా రైస్ మిల్లర్లు, దళారుల చేతుల్లో తోలుబొమ్మగా మారారు' అని ఘాటుగా విమర్శించారు. పెద్దవాగు ప్రాజెక్ట్ కొట్టుకు పోవడానికి పూర్తిగా ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీష్ రావు ఆరోపించారు. ప్రమాద సమయంలో గేట్లు ఎత్తే నాథుడే లేకపోవడం వల్లే ఆ ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టలేదు సరే కదా, ఉన్న ప్రాజెక్టులను కూడా కాపాడుకోలేక కొట్టుకుపోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ బావులకు, బోరుబావులకు రైతుల వద్ద 'డిస్కమ్' మీటర్లు పెట్టాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే రైతులకు రోజుకు కేవలం 6 గంటల కరెంట్ మాత్రమే వస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 24 గంటల కరెంట్ ఎలా ఉంటుందో, అశ్వారావుపేట గ్రామీణ ప్రాంతాల్లో కూడా అలానే ఉండాలని ఆశించి ఉచిత విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్సీ, ఎస్టీలకు ఒక్క కార్పొరేషన్ లోన్ కూడా ఇప్పించలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎంతమంది గిరిజన పిల్లలకు సహాయం అందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశ్నిస్తే.. రూ. 2,750 కోట్లు కేటాయించామని చెప్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ గిరిజన వ్యతిరేక ప్రభుత్వమని హరీష్ రావు దుయ్యబట్టారు.

## పాఠశాలలు, అంగన్‌వాడీలకు
# నిరంతర నీటి సరఫరా

మొదటిపేజీ తరువాయి

ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

మొదటిపేజీ తరువాయి

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు.

అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళా

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమం ద్వారా మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో విస్తృతంగా చర్చించిన అనంతరం ఎంపిక చేసిన ఏడు సన్న వరి రకాలకు ప్రోత్సాహకంగా బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి విత్తనాలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా ఈ మేళాలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని రైతు వేదికల్లో నిర్వహించే ఈ విత్తన మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాల విక్రయంతో పాటు వాటి సాగు పద్ధతులు, పంట యాజమాన్యం, అధిక దిగుబడుల సాధనకు సంబంధించిన సాంకేతిక సూచనలను కూడా అందించనున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యక్షంగా మార్గనిర్దేశర చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ మేళాల కోసం 1,24,649 క్వింటాళ్ల వరి విత్తనాలు, 6,913 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు సిద్ధం చేశారు. అదనంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచారు.

కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ , 'నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించబడు కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంతో పాటు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని మంత్రులు పిలుపునిచ్చారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. సహజ మరణం, ప్రమాద మరణం వంటి సందర్భాల్లో బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# ధాన్యం కుంభకోణంలో కాంగ్రెస్ నేతల హస్తం

- ఆది శ్రీనివాస్ అనుచరులదే ఈ పన్నాగం
- లోతైన విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయి
- మీడియా సమావేశంలో సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ధాన్యం కుంభకోణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులదే ప్రధాన పాత్ర అని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి ఆరోపించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కుంభకోణంలో ఇప్పటివరకు బయటపడింది రవ్వ అంతే అని లోతైన విచారణ జరిపితే పెద్ద ఎత్తున అవినీతి గుట్టలు బయటపడతాయన్నారు. సాక్షాత్తు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వగ్రామంలో ఆయన ప్రధాన అనుచరుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు స్వామి అలియాస్ గడ్డం నర్సారెడ్డి నకిలీ ట్రక్ షీట్లతో రెండు లారీల ధాన్యం అమ్మినట్లు పోలీసులు నిర్ధారించి అరెస్టు చేశారని గుర్తు చేశారు. రుద్రంగి ధాన్యం, మక్కల కొనుగోలు వ్యవహారంలో లోతైన విచారణ జరిపితే పెద్ద ఎత్తున ధాన్యంతో పాటు మక్కలు కూడా ఇదే తరహాలో నకిలీ పత్రాలు సృష్టించి అమ్మినట్లుగా తెలుస్తోందని ఆరోపించారు. స్వామి ఆదికి ముఖ్య అనుచరుడు కావడంతోనే రుద్రంగిలో డీసీఎంఎస్ ద్వారా ప్రత్యేక ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఆ బాధ్యతలు అప్పగించారని అన్నారు. నియోజకవర్గ కేంద్రం వేములవాడలో కాకుండా రుద్రంగిలో మొక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడమే ఆయనకు సన్నిహితుడనే విషయం బహిర్గతమైందన్నారు. మల్కపేట శ్రీనివాస్, రుద్రంగి స్వామి అలియాస్ నర్సారెడ్డి కాంగ్రెస్ అనుచరులు అనడానికి ఇదిగో సాక్ష్యం అంటూ ఆది శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్న చిత్రాలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను చూపుతూ బహిర్గతం చేశారు. దొంగలు దొరికాక ఇప్పుడు తమ వాళు కాదని మీడియా సమావేశాలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు, బీసీ బిడ్డ ఎదుగుతే చూడలేక ఆరోపణలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు కూడా చేస్తున్నారని అన్నారు. ఆది శ్రీనివాస్ బీసీ బిడ్డగా మంత్రి పదవి వస్తే పూర్తి స్థాయిలో స్వాగతి ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కూడా పాటుపడతాడని నమ్మకం ఉందని, కానీ అవినీతి జరిగినప్పుడు తప్పకుండా ప్రశ్నిస్తామని చెప్పారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను కొనడానికి రాని చేతులు, కోట్లాది రూపాయల కుంభకోణాలకు ముందుకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల్లో అవినీతి అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. అవినీతి కుంభకోణం బయటికి రావడంతో ధాన్యం విక్రయించిన జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారని వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, సీఎంకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నటువంటి ఆది శ్రీనివాస్ ఈ సంఘటనలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించి రైతులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఆయనపైనే ఉందని అన్నారు. గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్లుగా కాంగ్రెస్ నాయకుల పనితీరు ఉందని ఎద్దేవా చేశారు. వార్తాపత్రికలలో వచ్చిన కథనాలను సామాజిక మాధ్యమాల్లో పెడితే కార్యకర్తలను అర్ధరాత్రి కూడా అని చూడకుండా పోలీసులు వేధిస్తున్నారని ఆమె అన్నారు. చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సురేష్ ను దివ్యాంగుడు కూడా అని కూడా చూడకుండా రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

# సింగరేణి బొగ్గు చోరీ జరగలే..
## ఈ అండ్ ఎం డైరెక్టర్ తిరుమలరావు

**ఇల్లెందు/టేకులపల్లి,**

సింగరేణి సంస్థలో 40 లక్షల టన్నుల బొగ్గు చోరీ జరిగిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సింగరేణి ఈ అండ్ ఎం డైరెక్టర్ తిరుమలరావు స్పష్టం చేశారు. సోమవారం ఇల్లెందు ఏరియాలో పర్యటించిన ఆయన, జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్ పర్యవేక్షణలోనే ఉంటుందని తెలిపారు. రోడ్డు మార్గంలో రవాణా అయ్యే ప్రతి వాహనంపై ఎస్ఏపీ, జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ, జియో ఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలు, బూమ్ బ్యారియర్లు, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందన్నారు.

అన్ని వేబ్రిడ్జిలు కోల్‌నెట్ డిజిటల్ వ్యవస్థకు అనుసంధానమై ఉండటంతో ప్రతి లారీ, ప్రతి రైల్వే వ్యాగన్ బరువు ఆన్‌లైన్‌లో నమోదు అవుతుందన్నారు. చెక్‌పోస్టులు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఆకస్మిక తనిఖీలు, హోలోగ్రామ్ చలానాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. భారీ స్థాయిలో చోరీలు జరగడం అసాధ్యమని స్పష్టం చేశారు.

అనంతరం టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసీలో తిరుమలరావు పర్యటించారు. వ్యూ పాయింట్ నుంచి గనిలో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, బ్లాస్టింగ్, లోడింగ్, రవాణా పనులను పరిశీలించారు. రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలు, యంత్రాల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు.

అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# తెలంగాణ కమలం తోటలో కలుపు మొక్కలు ఉన్నాయా?

**గజెల్లి రాజేంద్ర ప్రసాద్, సోషల్ అనలిస్ట్**

వీడియోలో తెలంగాణ బీజేపీ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు మరియు 'కోవర్ట్' (కుట్రపూరిత) రాజకీయాల గురించి వివరిస్తున్నారు. పార్టీ అధిష్టానం చేపట్టిన ఆపరేషన్ కోవర్ట్ మరియు పార్టీ నేతల తీరుపై వస్తున్న విమర్శలు ఇలా వినిపిస్తున్నాయి.




▪ **అంతర్గత కలతలు**

తెలంగాణలో అధికారం దక్కించుకోవాలని బీజేపీ ఢిల్లీ అధిష్టానం తీవ్రంగా ప్రయత్నిస్తున్న తరుణంలో, కొందరు పార్టీ నేతలు సొంత అజెండాతో వ్యవహరిస్తూ అధికార పార్టీ బీఆర్ఎస్ మరియు ఇతర పార్టీలతో దోస్తీ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

▪ **కోవర్ట్ రాజకీయాల ఆరోపణలు**

పార్టీ మీటింగ్‌లలో చర్చించే రహస్య విషయాలను ప్రత్యర్థి పార్టీలకు చేరవేస్తున్నారని, కొన్ని నియోజకవర్గాల్లో నేతలు అధికార పార్టీ నాయకుల కార్యక్రమాల్లో పాల్గొంటూ వారికి మద్దతుగా ఉంటున్నారని పార్టీ పెద్దలు గుర్తించారు.

▪ **అధిష్టానం హెచ్చరిక**

ఈ క్రమంలో, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ అభయ్ పాటిల్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

▪ **పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సింహం వేటకు వెళ్ళినప్పుడు తోకలు ఊపడం తగదని సూచించారు.**

భవిష్యత్తు లో జిహెచ్ఎంసి కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, కమలం పార్టీ తన తోటలోని 'కలుపు మొక్కలను' అంటే పార్టీని దెబ్బతీసే నాయకులను గుర్తించి, కోవర్ట్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని యోచిస్తోంది.

# తెలంగాణ ABVP బంద్ విజయవంతం

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

▪ **తెలంగాణ వ్యాప్తంగా నిన్న జూన్ 23, 2026 రోజున అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) ఇచ్చిన విద్యాసంస్థల (పాఠశాలల) బంద్ పిలుపు ప్రభావం మిశ్రమంగా మరియు విస్తృతంగా ఉంది.**




హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన జిల్లాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందుజాగ్రత్త చర్యగా ఈరోజు సెలవు ప్రకటించాయి. అయితే, కొన్ని ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా నడవడంతో ఏబీవీపీ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి.

▪ **బంద్ ప్రభావం ఎలా ఉందంటే?**

ముందుస్తు సెలవులు: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు హైదరాబాద్ మరియు ఇతర జిల్లాల్లోని మెజారిటీ ప్రైవేట్ యాజమాన్యాలు నిన్న రాత్రే తల్లిదండ్రులకు సెలవు సందేశాలు పంపాయి.

**ప్రతిఘటనలు – అరెస్టులు:** హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల యథావిధిగా తెరవడంతో, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు క్లాస్‌రూమ్‌లలోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. దీనివల్ల అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

జిల్లాల్లో ధర్నాలు: జగిత్యాల, నిజామాబాద్, హన్మకొండ వంటి ప్రాంతాల్లో డీఈఓ (DEO) కార్యాలయాల ఎదుట విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు భారీ ధర్నాలు నిర్వహించారు.

▪ **బంద్ డిమాండ్లు**

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ ఏబీవీపీ ప్రధానంగా 8 డిమాండ్లతో ఈ బంద్‌కు పిలుపునిచ్చింది.

**ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై వ్యతిరేకత:** ప్రభుత్వం 'రేషనలైజేషన్' లేదా 'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' పేరుతో రాష్ట్రంలోని సుమారు 23,000 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని చూస్తోందని, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజుల నియంత్రణ చట్టం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని, దీనిని అరికట్టేందుకు తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని (Fee Regulatory Act) తీసుకురావాలన్నారు.

ఉచిత సీట్ల కేటాయింపు: విద్యా హక్కు చట్టం (RTE) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల కోటాను కచ్చితంగా అమలు చేయాలి.

యూనిఫామ్స్, పుస్తకాల విక్రయాల దోపిడీ: ప్రైవేట్ పాఠశాలల్లోనే పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్‌లను అధిక ధరలకు బలవంతంగా విక్రయించడాన్ని నిషేధించాలి. అదే సమయంలో విద్యాసంవత్సరం ప్రారంభమైనా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంకా యూనిఫామ్స్ అందకపోవడాన్ని తప్పుబట్టారు.

పోస్టుల భర్తీ: విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డీఈఓ (DEO), ఎంఈఓ (వీజూా), ప్రధానోపాధ్యాయులు (HM) పోస్టులతో పాటు అన్ని టీచింగ్, నాన్-టీచింగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.

మౌలిక వసతులు: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్‌లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

**మధ్యాహ్న భోజన నాణ్యత:** ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన నాణ్యతను పెంచాలని, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.

నూతన విద్యా విధానం (NEP 2020): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానం-2020ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో ప్రముఖ విద్యార్థి సంస్థ ఏబీవీపీ ఇచ్చిన బంద్ పిలుపు ఘనవిజయం సాధించిందని ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా నివేదికలు అందించాయి.

# వెల్దుర్తి రైతు వేదిక లో విత్తనాల మేళ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు వెల్దుర్తి వ్యవసాయఅధికారిని ఝాన్సీ

**వెల్దుర్తి రైతు వేదికలో విత్తన మేల కార్యక్రమంలో పాల్గొన్న రైతులు వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారిని ఝాన్సీ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల పంపిణీ**

**కరపత్రం ప్రతినిది వెల్దుర్తి మాసాయిపేట జూన్ 23**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని మంగళవారం నాడుజరిగిన వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించిన రైతు వేదిక వెల్దుర్తిలో విత్తనమేల కార్యక్రమంలో భాగంగా పలువు రైతులు విత్తన డీలర్లు పాల్గొని సన్న రకాలైన కే ఎన్ ఎం 1638 బిపిటి 5204 మరియు ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాలని కొనుగోలు చేయడం జరిగిందని వారు తెలియజేశారు రైతులు ప్రస్తుతం వర్షాకాలంలోని రైతులు పండించుకున్నటువంటి ఖరీఫ్ పంట కు సరియైన నాణ్యతమైన విత్తనాలను అందజేయాలని ఉద్దేశంతోనే ఎటువంటి నాణ్యతలేని వరి విత్తనాలను రైతులకు సరఫరా కావద్దని ఉద్దేశంతోనే రైతు వేదికల్లో విత్తనాల మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని నేరుగా రైతులు వరి విత్తనాలను రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపించాలని ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం విత్తనాల మేల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మంగళవారం నాడు వెల్దుర్తి రైతు వేదికలో పలు గ్రామాల రైతులు సన్న రకం వరి ధాన్య విత్తనాలను విక్రయించడం జరిగిందని మంగళవారం నుండి గురువారం వరకు రైతు మేళా కార్యక్రమం ఉంటుందని రైతులకు సన్న రకం వరి దాని విత్తనాలు కావాలి అంటే వెల్దుర్తి రైతు వేదికలో నిర్వహించినటువంటి విత్తనాల మేల కార్యక్రమంలో పాల్గొని వారికి నచ్చినటువంటి విత్తనాలను తీసుకువెళ్లాలని వారు తెలియజేశారు రైతే రాజ్యం అనే విధంగానే సంబావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విత్తనాల మేళ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వెల్దుర్తి మండలంలోని ప్రతి ఒక్క రైతు తమ పొలాలను వారి దుకాలను వేసుకోలేని రైతులు రైతు వేదిక వచ్చి తమకు నచ్చిన విత్తనాలను తీసుకువెళ్లాలని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల విత్తన డీలర్లు వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ విస్తరణాధికారులు రైతులు పాల్గొన్నారు.








# పద్దెనిమిది యేళ్ళు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**-అందోలులో ఎస్ ఐ ఆర్ పై శిక్షణ శిబిరం**
**-డూప్లికేట్ ఓట్లు తొలగించి, తప్పుల్లేని జాబితా రూపొందించాలి**
**-మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**కరపత్రం ప్రతినిది అందోలు (జూన్ 23)**





సంగారెడ్డి జిల్లా అందోలు మండలంలోని సంగుపేట చౌరస్తా వద్ద లక్ష్మీదేవి గార్డెన్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ లో బాగంగా మంగళవారం శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని బూత్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఇది ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని బి ఎల్ ఏ లకు మంత్రి సూచించారు. చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు తొలగించాలి. అడ్రస్ మారిన వారి వివరాలు సరిచేయాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడు కూడా జాబితాలో లేకుండా పోకూడదు అని ఆయన బి ఎల్ ఏ లకు పిలుపునిచ్చారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతగా నిర్వహించాలని ఆయన నొక్కి చెప్పారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఎ ఐ సి సి సెక్రటరీ సచిన్ సావంత్, పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎం పి సురేష్ షెట్కర్, ఎం ఎల్ ఎ డా. సంజీవ రెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, డి సి సి ప్రెసిడెంట్ కాటా శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖకు కవితా ఫ్రేమ్ అందజేసిన నీలాజ్యోతి

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 23**



తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖకు ఫ్యామిలీ మోటివేటర్, ఫ్రీలాన్స్ పొయట్ జర్నలిస్ట్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి ప్రత్యేక కవితా ఫ్రేమ్‌ను అందజేశారు.

మంత్రి కొండా సురేఖ ప్రజాసేవ, సహకార భావం, నాయకత్వ లక్షణాలను ప్రతిబింబించేలా రూపొందించిన కవితా ఫ్రేమ్‌ను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అందజేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపే నాయకురాలిగా కొండా సురేఖ ప్రత్యేక గుర్తింపు పొందారని నీలాజ్యోతి పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రతీకగా, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న మంత్రి సేవలను కవితా రూపంలో ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చే నాయకత్వానికి గుర్తింపుగా ఈ కవితా ఫ్రేమ్‌ను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీవీ రీజనల్ ఇన్‌చార్జ్ అశోక్, సీనియర్ ఫ్రీలాన్స్ పొయట్ జర్నలిస్ట్ విజయసంకల్పం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నీలాజ్యోతిని అభినందించారు.

# బాధిత కుటుంబాలకు అండగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 23**





చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇటీవల మృతిచెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుందరగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామశాఖ అధ్యక్షులు బత్తిని సత్యనారాయణ, పత్యం పద్మ, నాబాబుపేట గ్రామానికి చెందిన దేవసాని గణపతి రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన వొడితల సతీష్ కుమార్, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ పెద్దలను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ తరపున తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని మృతుల కుటుంబాలకు తమ సానుభూతిని తెలియజేశారు.

# భీమయ్యకు ఘన సన్మానం

▪ **జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక, నంది అవార్డు సాధనకు అభినందనల వెల్లువ**

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 23**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పైడిపల్లి భీమయ్యకు ద్విగుణీకృత గౌరవం దక్కింది. ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతో పాటు, ఇల్లంతకుంట ప్రెస్ రిపోర్టర్‌గా ప్రతిష్ఠాత్మక నంది అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకులు పోతుల శ్రీనివాస్, లింగాల లింగారావు, బండి పవన్, మారెపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భీమయ్యకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. వైద్య రంగంలోనూ, పాత్రికేయ రంగంలోనూ ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న భీమయ్య మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు ఆకాంక్షించారు. ఆయన సాధించిన ఈ గుర్తింపు ధర్మారం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పైడిపల్లి భీమయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ ప్రతినిధులకు, తనను సన్మానించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందిస్తూ, తన వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు.

కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని భీమయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీజేపీ ఎండోమెంట్ సెల్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ రామన్న పోచాలు ప్రసాద్ నియామకం

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 23**



బీజేపీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక విభాగం) హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ రామన్నగారి పోచాలు ప్రసాద్ ను నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ అన్నవోజుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బర్కతపురలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామన్నగారి పోచాలు ప్రసాద్ ను పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం పోచాలు ప్రసాద్ మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ ధార్మిక రంగ అభివృద్ధి, ఆలయాల పరిరక్షణ, హిందూ ధార్మిక విలువల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నేతలు తనకు అందించిన ప్రోత్సాహం, సహకారానికి పోచాలు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## 1900 రోజులుగా నిరంతర అన్నదాన సేవలు
## పేదలకు భోజనం, వాటర్ బాటిళ్ల పంపిణీ




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1900 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం లక్ష్మీగణపతి కాంప్లెక్స్, రాజన్న, భీమేశ్వర ఆలయాల వద్ద పేదలు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించి వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కీ.శే. ఆకుల నరేష్ కుమార్ మొదటి నెల తిథి సందర్భంగా ఆయన తల్లి ఆకుల భారతి, ఆకుల సురేష్--సంజన దంపతులు అన్నదానానికి సహకరించారు. అలాగే అమెరికాలో పుట్టినరోజు జరుపుకుంటున్న జెరిపోతుల యువన్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో పేదలకు ఒక్కపూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు నంబర్ 92469 39388ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, మఠం శివకుమార్, పాశం భాస్కర్ రెడ్డి, పంబి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ం

## పాఠశాల బంద్ విజయవంతం -- విద్యా సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూన్ 23**
హుజూరాబాద్ పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నగర శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, విద్యార్థుల హక్కులను కాపాడడం లక్ష్యంగా ఈ బంద్ చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్డీ ప్రాంత కో-కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనివల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టాన్ని



తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారులు, జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే కీలకమైన ఈ పోస్టులను భర్తీ చేయడం అత్యవసరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 27 వేల పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదిస్తామని చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని



విద్యార్థుల తరపున డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల సంఖ్య తగ్గించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బంద్ కార్యక్రమంలో ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి గౌతమ్, అరుణ్, సత్య, నగర ఉపాధ్యక్షులు సాయి తేజ, సిద్దు, రామ్ చరణ్, మారుతి, ప్రవీణ్, ఆయన్ తదితర విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

## శిశు మందిర్ పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. సుమన్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి ఆయన వివరించారు. నేటి సమాజంలో వివిధ రూపాల్లో మత్తు పదార్థాలు ఎలా అందుబాటులోకి వస్తున్నాయో, వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. తమ పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిసినప్పుడు పోలీసులకు ఎలా సమాచారం అందించాలో విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, చిన్న కూల్‌డ్రింక్స్, జంక్‌ఫుడ్ వంటి అలవాట్లతో ప్రారంభమయ్యే అనారోగ్యకర జీవనశైలి క్రమంగా మత్తు పదార్థాల వైపు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మంచి స్నేహాలు, సానుకూల ఆలోచనల ద్వారా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను జీవితానికి దూరంగా ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం ముగింపులో




విద్యార్థులందరితో "ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడబోమని, వాటి బారిన పడకుండా తమను తాము కాపాడుకుంటామని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందశీ, డాక్టర్ నాళ్ల సత్యవిద్యాసాగర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్,పులల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకుల దేవి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పై మైనారిటీలు ఆందోళన ,అపోహలను వీడండి.

**బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై మైనారిటీ వర్గాల్లో ఉన్న అపోహలను వీడాలని బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ కోరారు. మంగళవారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జన సంగ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ముజీబ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కలలు కన్న ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఈనెల 25 నుండి ప్రారంభం కాబోతున్న ఎస్ ఐ ఆర్ విషయంలో మైనార్టీ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు ఒత్తిడికి గురికావద్దన్నారు. ఈ విషయంలో అనవసరమైన భయాందోళనలకు లోనుకావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అక్రమ ఓట్ల తొలగింపు ప్రక్రియ లో ముఖ్యంగా పరాయి దేశాల నుంచి వచ్చి, అక్రమంగా భారత దేశంలో ఓటు హక్కు పొందిన వారిని గుర్తించి, అటువంటి అక్రమ ఓట్లను తొలగించే అవకాశం మాత్రమే ఈ ప్రక్రియలో ఉందని ఆయన వివరించారు. దీనివల్ల భారతీయ పౌరులైన వారికి ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు. ఎస్ ఐ ఆర్ అనేది ప్రతి 20 ఏళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా జరిగే సాధారణ ప్రక్రియ అని, దీనిని కేవలం పరిపాలనా పరమైన చర్యగా చూడాలని ఆయన సూచించారు. ఇది రాజకీయ కోణంలో చేసేది కాదని ఆయన స్పష్టం చేశారు. దేశ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా ఉంచేందుకు, అర్హులైన వారికే ఓటు హక్కు ఉండేలా చూడటానికి ఈ రివిజన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇది ఏ ఒక్క వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదని, కేవలం నిబంధనల మేరకు అక్రమ ఓట్లను తొలగించి, జాబితాను సరిచేసే ప్రక్రియ మాత్రమేనన్నారు. వదంతులను నమ్మవద్దని, వాస్తవాలను గ్రహించాలని ఆయన మైనారిటీ సోదరులకు విజ్ఞప్తి చేశారు.ం

## విత్తన మేళాకు రైతుల నుంచి స్పందన

**ఆబాది జమ్మికుంట రైతువేదికలో నాణ్యమైన వరి విత్తనాల విక్రయాలు**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 23**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జమ్మికుంట మండలంలోని బిజీగిర్ షరీఫ్, మడిపల్లి, ఆబాది జమ్మికుంట రైతువేదికలలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలలో జమ్మికుంట మండలంలో అందుబాటులో ఉన్న రకాలను సంబంధిత విత్తన డీలర్ల ద్వారా రైతులకు విక్రయించారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట సులభంగా కొనుగోలు చేసుకునే విధంగా ఈ విత్తన మేళాను



ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా నేరుగా ధృవీకరించిన విత్తనాలను పొందేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు విత్తన మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పంటల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను



కొనుగోలు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. నేడు ఆబాది జమ్మికుంట రైతువేదికలో నిర్వహించిన విత్తన మేళాలో నలుగురు రైతులు ఆర్ఎన్ఆర్--15048, కేఎన్ఎం--1638 వరి విత్తనాలను కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## రైతు వేదికలో విత్తనలమేలా కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం

**మాసాయిపేట రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమంలో సుమారు మూడు క్వింటాల వరకు విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు వ్యవసాయ అధికారిని కవిత సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి**
**ఈ కార్యక్రమం ద్వారా రైతులకు కల్తీ లేని విత్తనాలను సరిపడా చేయడమే ప్రభుత్వ లక్ష్యం**





**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జూన్ 23**
మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని ప్రభుత్వ లక్ష్యం మనీ ఎటువంటి కల్తి విత్తనాలు కొనుగోలు చేయకుండా నేరుగా రైతు వేదికలో నీ విత్తన దుకాణ డీలర్ల సహాయంతో రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేయకుండా నాణ్యమైన విత్తనాలను మంగళవారం నాడు మాసాయిపేట రైతు వేదికలు అందజేయడం జరిగిందని మాసాయిపేట మండల వ్యవసాయ అధికారిని కవిత గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దొడ్డు వరివిత్తనాలు వేయకుండా సన్న రకం వరి విత్తనాలు ఆర్ఎన్ఆర్15048 హెచ్ఎంటి జై శ్రీరామ్ 44..7715 రకాల విత్తనాలను వేయాలని వారు తెలియజేశారు ప్రభుత్వం ఆరు రకాల విత్తనాలను రైతులు వారి పొలాలలో సన్న రకం విత్తనాలు వేసి వరి పంటను పండించుకోవాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులు మంగళవారం నాడు మాసాయిపేట రైతు వేదికలో విత్తనాల మేల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమానికి మాసాయిపేట మండల పరిధిలోని పలుగ్రామ రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వారికి ఆరు విత్తనాల లో వారికి నచ్చిన విత్తనాల బస్తాలను తీసుకువెళ్లడం జరిగిందని విత్తనాల మేళ కార్యక్రమంఈ మూడు రోజులలో రైతులు వరి నారు వేసుకోవడానికి రైతు వేదికకుస్వయంగా వచ్చి రైతులే తీసుకువెళ్లాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పలు గ్రామ సర్పంచ్లు గ్రామ రైతులు మాసాయిపేట మండల పరిధి రైతులు పాల్గొన్నారు.

## ఓటర్ గణన ఫారాలు తెలుగుతో పాటు ఇంగ్లీష్‌లోనూ అందుబాటులో ఉంచాలి: ఆర్డీఓకు కాంగ్రెస్ నేతల వినతి

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, జూన్ 23:**
భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టబోయే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ (గణన) ఫారాలను పంపిణీ చేయనున్న నేపథ్యంలో, ఆ ఫారాలను తెలుగుతో పాటు ఇంగ్లీష్ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో హుజూరాబాద్ ఆర్డీఓ కమ్ అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ జాల కుమారి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేపట్టబోయే ఓటరు గణన ప్రక్రియలో ప్రతి పౌరుడు సులభంగా భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న గణన ఫారాలు కేవలం తెలుగులో మాత్రమే ముద్రించబడుతున్నాయని, దీంతో తెలంగాణలోని ముస్లింలు, క్రైస్తవులు, ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం చేసిన పౌరులు ఫారాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు



ఎటువంటి ఇబ్బందులు లేకుండా తన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. అందుకే తెలుగుతో పాటు ఇంగ్లీష్ భాషలో కూడా ఫారాలను ముద్రించి అందుబాటులో ఉంచాలని కోరుతూ హుజూరాబాద్ ఆర్డీఓ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మొలుగూరి సదయ్య మాట్లాడుతూ, భాషా పరమైన ఇబ్బందుల కారణంగా ఎవరూ ఓటరు నమోదు ప్రక్రియకు దూరం కాకూడదని అన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి వర్గానికి అర్థమయ్యే విధంగా ఫారాలు


Vice-President
To,
The Revenue Divisional Officer, cum Additional Election Officer,
Huzurabad.
Subject:- Request for Availability of Enumeration Forms in English Along with Telugu for SIR-2026- Reg.
Respected Madam,
[illegible]
I therefore request you to kindly take up the matter with the Chief Electoral Officer, Telangana, and the Election Commission of India and ensure that Enumeration Forms in English are also made available in Huzurabad constituency-31 limits.
I shall be grateful for your kind consideration and necessary action.
Thanking you,
Yours faithfully,
SADAIAH MOLGOORI (VAKIL)
Vice-President
Karimnagar District Congress Committee

అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకట్, జిల్లా కార్యదర్శులు మిడిదొడ్డి శ్రీనివాస్, టేకుల శ్రావణ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికుటి మదన్ రావు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీఓ జాల కుమారి నాయక్ సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.